క్లుప్తంగా

జీవో నంబర్ 117ను రద్దు చేయాలి



రవికుమార్‌ను కలిసిన ఫెడరేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రాథమిక విద్యను అస్త వ్యస్తం చేస్తున్న జీవో నంబర్ 117ను రద్దుచేసే విధంగా చొరవ తీసుకోవాలని నోబుల్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సూర పాపారావు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని శాంతినగర్‌కాలనీలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌ని నోబుల్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు మంగళవారం కలిసి విజ్ఞప్తి చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆ సంఘ ఆర్థిక కార్యదర్శి వి.రాజారావు, బి.భాస్కరరావు, కూన రంగనాయకులు ఉన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు



పూజలందుకున్న సుబ్రహ్మణ్యస్వామి

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో మంగళవారం సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్‌గురూజీ ఆధ్వర్యంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు ఆలయాలలో సంకష్ట హర చతుర్థి సందర్భంగా వినాయకునికి ప్రత్యేక పూజలు మంగళవారం జరిగాయి. పాలకొండ రోడ్డులో వేంచేసిన విజయగణపతి ఆలయంలో అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో రజత వినాయకునికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. అలాగే మూలమూర్తికి కూడా అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సోషల్ ఆడిట్

హిరమండలం: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను సోషల్ ఆడిట్ బృందాలు క్షేత్రస్థాయిలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనులతోపాటు, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా చేపట్టిన పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. పనుల నాణ్యత, కొలతలు, బిల్లుల చెల్లింపులు వంటి అంశాలపై తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ ఎస్‌ఆర్పీ తిరుపతిరావు మాట్లాడుతూ ఏడుగురు డీఆర్పీలతో బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో తనిఖీలు నిర్వహించడం జరుగుతందన్నారు. ఈ తనిఖీలు జులై 8వ తేదీ వరకు ఉంటాయన్నారు. తనిఖీలు పూర్తయిన చోట్ల గ్రామ సభలు నిర్వహించడం జరుగుతందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కొత్తూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య, అంగన్‌వాడీ, పంచాయతీరాజ్ సిబ్బందికి ఎంపీడీఓ త్రివిక్రమరావు, ఈఓపీఆర్డీ కృష్ణారావుతో పాటు పలువురు మండల స్థాయి అధికారులు సూచించారు. పలు శాఖలకు చెందిన ఉద్యోగులతో మండల పరిషత్ సమావేశం మందిరంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి ముందు వాడుక నీరు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

సకాలంలో సాగునీరివ్వాలి

- లేదంటే ఆమరణ నిరహార దీక్షా చేస్తా
- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



గార: వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

శ్రీకాకుళం రూరల్: రైతులకు సకాలంలో సాగునీటిని అందించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ జిల్లా అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. లేదంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. శ్రీకాకుళంలోని విశాఖ–బీ కాలనీలో గల క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం క్రితం చింతాడ నుంచి మునసబుపేట వరకూ గల ఇరిగేషన్‌కు సంబంధించిన కల్వర్లలు, గెడ్డలను పరిశీలించినట్టు చెప్పారు. ఎక్కడికక్కడే గుర్రపుడెక్కతో పాటు పూడికలు, పెద్ద పెద్ద బండరాళ్లు సాగునీరు వెళ్లే గెడ్డల మధ్య ఉన్నాయని.. ఇలా అయితే ఈ ఖరీఫ్‌లో ఆయకట్టుకు సాగునీరు ఎలా అందించగలమన్నారు. ఇప్పటికే యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని.. మరో పది రోజుల్లోగా పనులు పూర్తి చేయకపోతే శ్రీకాకుళంలోని ఏడురోడ్ల జంక్షన్ వద్ద ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటానని వెల్లడించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన శ్రీకాకుళం నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. భారీ మెజార్టీతో గెలిచిన తనను సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా అభినందించారని చెప్పుకొచ్చారు. ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రజలు తనను నేరుగా కలవచ్చునన్నారు. వచ్చే నెల నుంచి ఇచ్చిన హామీ మేరకు పెంచిన డబ్బులతో కలిపి పింఛన్‌ను లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. శ్రీకాకుళం పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కొరత ఉందని.. వాటిపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ఉమెన్స్ కాలేజీలో చెట్లుకింద చదువులు కొనసాగుతున్నాయని, స్టేడియంలోఅభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదన్నారు. అలాగే పట్టణంలోని డ్రైనేజీలన్నీ కంపుకొడుతున్నాయని, దీనిపై స్పెషల్ డ్రైవ్ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా గ్రంథాలయంలో లైట్లు, ఫ్యాన్‌లు ఎక్కడా కనిపించడం లేదన్నారు. బుధవారం నుంచి అన్నిశాఖల శాఖల కార్యాలయాలకు వెళ్లి సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎవరైనా దౌర్జన్యాలు, దురాక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా ఇసుక తరలించివారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. విలీన పంచాయతీలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు ఇవ్వడం లేదని దీనిపై సంబంధింత శాఖ అధికారులతో మాట్లాడుతానని చెప్పారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు త్వరితగతిన నిర్వహించేలా చూడాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కోడిరామ్మూర్తి స్టేడియం పనులు రీ టెండర్ అయినప్పటికీ ఇంకా పనులు ప్రారంభించలేదన్నారు.

శివారు ప్రాంతాలకు సాగునీరందిస్తాం

గార: మండలంలోని శివారు ప్రాంతాలకు సాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ చెప్పారు. గారలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద వరి విత్తనాలను రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడుల సహకారంతో రైతాంగానికి మేలు చేసేలా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. బుధవారం నియోజకవర్గంలోని నారాయణపురం ఛానల్, భైరిదేశిగెడ్డ, వంశధార కుడి ప్రధాన కాలువ అధికారులతో సమావేశం నిర్వహిస్తానన్నారు. అన్ని కాలువుల్లో పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించినట్టు చెప్పారు. మండల కేంద్రంలోని ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడం, అంబళ్లవలస వద్ద ఎత్తిపోతలు పథకం మంజూరుతో పాటు వంశధార నదిపై బ్రిడ్జి పనులు జరిగేలా చూస్తానన్నారు. అనంతరం ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన ఎమ్మెల్యేను అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మార్పు సుజాత, గుండ భాస్కరరావు, గొండు మూర్తి, మార్పు ధర్మారావు, వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్, ఏడీఏ బగ్గు రజిని, ఇన్‌చార్జి తహసీల్దార్ సీహెచ్ ప్రసాదరావు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



కల్యాణం చేస్తున్న అర్చకులు



హాజరైన దంపతులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో ఉన్న భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు చామర్తి గోపాలాచార్యులు, చామర్తి జగన్నాథాచార్యుల నేతృత్వంలో భూదేవి, శ్రీదేవి సమేతంగా వేంకటేశ్వరుని ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి కన్యాదానం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల సంప్రదాయంగా కల్యాణ వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో దంపతులు కల్యాణ వేడుకలలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త సన్యాసిరావు, బిర్లంగి రామ్మోహన్‌రావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



అమ్మవారిని దర్శించుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి, శ్రీకాకుళం జేసీ నవీన్

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా అమ్మవారికి నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కలెక్టర్‌గా పనిచేసి బదిలీ అయిన నాగలక్ష్మి, శ్రీకాకుళం జేసీ నవీన్‌లు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికి వేదాశీస్సులు, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు పర్యవేక్షించారు.

పశువులకు గొంతువాపు నివారణ టీకాలు



ఎట్టుపురంలో పశువుకు టీకా వేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: పట్టుపురం, పాకివలస, మెండపేట గ్రామాల్లో పశువులకు గొంతువాపు నివారణ టీకాలను పశువైద్య సిబ్బంది మంగళవారం వేశారు. 248 పశువులకు టీకాలను తమ సిబ్బంది వేశారని కోటబొమ్మాళి వెటర్నరీ ఏడీ మంద లోకనాథం చెప్పారు. పశువులకు అధికజ్వరం, ఆహారం తినకపోవడం వంటి లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారమివ్వాలని కోరారు. కార్యక్రమంలో కురుడు, తిలారు పశువైద్యులు ఎల్.కిరణ్‌కుమార్, మెండ పస్నచైతన్య, వెటర్నరీ సహాయకులు కె.ముఖుందరావు, కోట ధర్మారావు ఉన్నారు.

విద్యకు ప్రాధాన్యం



విద్యార్థులకు స్టూడెంట్‌కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ధర్మపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్‌కిట్లను మంగళవారం అందజేశారు. ఎంఈవో కె.అప్పారావు, జనసేన పార్టీ నాయకుడు దాసరి రాజు, మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, మేరుగు సూర్యనారాయణ, హెచ్‌ఎం ఎస్.విశ్వనాథం పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

నందిగాం: మండల కేంద్రమైన నందిగాం గణేష్ కాలనీలో కొలువై ఉన్న వరసిద్ధి వినాయక ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి దంపతులు, గణేష్ కాలనీ వాసులు ఆధ్వర్యంలో గ్రామపురోహితులు రేజేటి బోసుబాబు, మేడేపల్లి రమేష్‌బాబులు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. దీనిలో భాగంగా సుప్రభాతసేవ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, విశేష అభిషేకాలు, గణపతి మూలమంత్ర హవనం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు మహాఅన్నప్రసాద వితరణ గావించారు. సాయంత్రం గణేష్‌కాలనీ చిన్నారులచే కోలాటంతో గ్రామమంతా స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు.

ఎక్కువ కేసులను రాజీ చేయాలి

కోటబొమ్మాళి: ఈ నెల 29న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్‌జడ్జి బి.ఎం.ఆర్. ప్రసన్నలత కోరారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు సివిల్, ఎస్‌ఈబీ పోలీసులు, న్యాయవాదులతో లోక్‌అదాలత్ నిర్వహణపై మంగళవారం సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఏజీపీ ఎస్.తిరుపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసులు, న్యాయవాదులు ఎస్.శ్రీధర్‌రాజు, వాన నేతాజీరావు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

ఎచ్చెర్ల క్యాంపస్: పూడివలస రైతు భరోసా కేంద్రంలో మంగళవారం వరి విత్తనాల పంపిణీని ప్రారంభించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ పావని మాట్లాడుతూ డిమాండ్, రిజిస్ట్రేషన్ల మేరకు అందుబాటులో ఉన్న వరి విత్తనాలను రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్పంచ్ జరుగుళ్ల కృష్ణారావు, మాజీ సర్పంచ్ గొలివి గోవిందరావు పాల్గొన్నారు.
25 ఈటీఎల్ 25: వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్, సచివాలయ సిబ్బంది

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లో పక్కాగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓ రామాదేవి అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంపై ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, గ్రామ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 29 వరకు పారిశుద్ధ్య ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. డ్రైనేజీలు శుభ్రం, తాగునీటి పథకాల క్లోరినేషన్, పైప్‌లైన్‌లు, చేతిపంపుల మరమ్మతులు వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏఓ పి.వి.కె.మోహన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ కిల్లారి నారాయణరావు పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురుగునీరు!



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 17వవార్డు తిలక్‌నగర్‌లో ఎస్‌ఎండీ పార్లర్ వెనుకవీధిలో రోడ్డుపైకి మురుగునీరు వచ్చి చేరింది. కాలువలలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో ఉన్నటువంటి మురుగునీరు రోడ్డుపైకి ప్రవహించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ శానిటేషన్ అధికారులు తక్షణమే వీధిలో పర్యటించి కాలువలు శుభ్రం చేసి దుర్గంధం నుంచి కాపాడాలని కోరుతున్నారు. పలు విద్యా సంస్థలతో పాటు, మంకినమ్మ ఆలయానికి ప్రధాన రహదారి కావడంతో ఇబ్బందిగా ఉందని సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రైవేట్ కళాశాలలకు దీటుగా..



కళాశాలలో కోర్సుల వివరాలు, సదుపాయాలను తెలియజేస్తూ ఏర్పాటు చేసిన బోర్డు

టెక్కలి: ప్రైవేట్ కళాశాలలకు దీటుగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వసతులపై సిబ్బంది ప్రచారం చేస్తున్నారు. సాధారణంగా ప్రైవేట్ కళాశాలలకు చెందిన యాజమాన్యం ప్రతీ ఏటా వారి కళాశాలలో అందజేస్తున్న కోర్సుల వివరాలు, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ఫొటోలు, మౌలిక సదుపాయాలపై హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తుంటారు. అయితే టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ వినూత్నంగా ఆలోచన చేశారు. కళాశాలలో అందజేస్తున్న వివిధ రకాల కోర్సులు, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలతో పాటు మౌలిక సదుపాయాలపై కళాశాలకు ఎదురుగా బోర్డులను ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కళాశాలపై ప్రచారాలు చేయడం స్థానికంగా ఆకట్టుకుంటోంది.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



రణస్థలం: మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ ఎస్ఐ రవిప్రసాద్



ఎచ్చెర్ల క్యాంపస్: మాట్లాడుతున్న సీఐ రామచంద్రరావు

రణస్థలం: మాదక ద్రవ్యాలకు అలవాటుపడి యువత భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రణస్థలం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ రవి ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల యువతకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించి, అవగాహన ర్యాలీ చేయించారు. ఏయే పదార్థాలను మాదక ద్రవ్యాలు అని పిలుస్తారో, వాటి వల్ల కలిగే దుష్ఫలితాలంటే సమగ్రంగా వివరించారు. పట్టుబడితే ఏలాంటి కేసులు నమోదు చేస్తామో యువతకు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, ఎస్ఈబీ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: సమాజానికి ఉత్తమ మానవ వనరులను అందించే విద్యా సంస్థలు గ్రడ్స్ (మాదక ద్రవ్యాలు) రహిత విద్యా సంస్థలు లక్ష్యంగా జేఆర్‌పురం సీఐ జి.రామచంద్రరావు అన్నారు. ఎచ్చెర్ల వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మంగళవారం మాదక ద్రవ్యాల ప్రభావంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలు జీవితాలను నాశనం చేస్తాయన్నారు. మానసికంగా శారీరకంగా ప్రభావం చూపే వీటి జోలికి వెళ్లవద్దని, ఎటువంటి అమ్మకాలు కనిపించిన పోలీసులకు, విద్యా సంస్థ యాజమాన్యాలకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులు ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లకు సైతం దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎస్.చిరంజీవి, వైస్ ప్రిన్సిపాల్ వి.కె.చక్రవర్తి, విభాగాధిపతి సత్యం, పీడీ వి.రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న దాతలు బాబూరావు, రామలింగం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించారు. దీంతో వారిని శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ విశ్రాంతి ప్రిన్సిపాల్ మురపల్లి బాబూరావు, మాజీ సర్పంచ్, లండ రామలింగం చేతుల మీదగా సోమవారం సత్కరించి అభినందించారు. అత్యధిక మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన గనగళ్ల చేతనకు పది వేల రూపాయల నగదుతో పాటు జ్ఞాపికను అందించారు. అలాగే ద్వితీయ, తృతీయ స్థానంలో మార్కులు సాధించిన కాస హాసినికి రూ. ఆరు వేలు, జె.సీమోనాకు రూ నాలుగు వేల నగదుతో పాటు జ్ఞాపికలను అందించారు. 500 మార్కులు దాటిన మరో ఐదుగురు విద్యార్థులకు ఒకొక్కరికీ వెయ్యి రూపాయల చొప్పున అందించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జగన్నాథం, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కామేష్, విద్యా కమిటీ చైర్మన్ మోహన్‌రావు, శ్రీరామ సంఘ అధ్యక్షుడు మద్దు కామేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



కొత్త చెరువులో పనులు ప్రారంభిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని గోవిందపురం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్ని రమణ అన్నారు. గోవిందపురం, సీతంపేట గ్రామాల్లోని కొత్త చెరువు, కొత్త ట్యాంకుల్లో ఉపాధి పనులను మంగళవారం ప్రారంభించారు. రైతులకు ఉపయోగపడేలా చెరువులకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఉప సర్పంచ్ గుంట సత్యం, కోఆప్షన్ మాజీ సభ్యులు పి.వేణుగోపాల్‌రావు, ఎం.నారాయణ, జి.గణేష్, పి.మోహనరావు, ఫీల్డు అసిస్టెంట్ ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాల విద్యను బలోపేతం చేయాలి



డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

కవిటి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి కొత్త ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు మొర్రి గోపి అన్నారు. 117 జీవోను రద్దుచేసి ప్రాథమిక విద్యకు ప్రతి గ్రామంలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కవిటి ప్రాథమిక పాఠశాలలో మండల స్థాయిలో మంగళవారం సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతూ తీర్మానం చేశారు. కొత్త పీఆర్సీపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాలను కొనసాగించాలన్నారు. సమావేశంలో మండల గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి రంగారావు, మండల ప్రధాన కార్యదర్శి గుడియా వంశీ, జిల్లా కార్యదర్శి శమల్ల రాజబాబు, కార్యవర్గ సభ్యులు శ్రీధర్ సమంతో, భార్గవ్, శరత్, ప్రకాష్, భగవాన్, శ్రీకాంత్, వెంకట్రావు ఉన్నారు.

శ్రీనివాస్ సేవలు అభినందనీయం



శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

సోంపేట: సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా దుద్ది శ్రీనివాసరావు ఏడాది పాటు అందించిన సేవలు అభినందనీయమని రోటరీ పీజీడీ జి.విశ్వనాథం, శ్రీశయన చైతన్య వేదిక ప్రతినిధులు అన్నారు. శ్రీశయన చైతన్యదీపిక సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాసరావు దంపతులకు మంగళవారం సత్కరించి అభినందించారు. వక్తలు మాట్లాడుతూ.. ఏడాదిగా సోంపేట, కంచిలి మండలాల్లో రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు చేసిన సేవలను గుర్తు చేశారు. చైతన్యదీపిక సంస్థ భవన నిర్మాణానికి రూ. 18 లక్షల విలువైన స్థలాన్ని అందించారని చెప్పారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వెంకటరమణ

కవిటి:

కవిటి మేజర్ పంచాయతీ కె.కొత్తూరులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఇప్పిలి వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో దోమలవ్యాప్తికి అధికంగా అవకాశాలు ఉన్న నేపథ్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాల పటిష్ఠంగా చేయాలన్నారు. వాటర్‌ట్యాంకుల క్లోరినేషన్, నీటి నాణ్యత పరీక్షలు చేపట్టాలన్నారు. రికార్డుల నిర్వహణపై ప్రత్యేకశ్రద్ధ కనబర్చాలని కవిటి పంచాయతీ ఈవో జి.వీరభద్రస్వామికి సూచించారు.

ఘనంగా గ్రామదేవత చల్లదనోత్సవం



సోంపేట: పలాసపురంలో గ్రామ దేవతను ఊరేగిస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని పలాసపురం, బెంకిలి గ్రామపంచాయతీల్లో ఆయాగ్రామ దేవతల చల్లధన ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. పలాసపురంలో గ్రామస్తులు, ఉపాధి వేతనదారులు, రైతుల ఆధ్వర్యంలో సింధుపట్టపురాణి చల్లధన మహోత్సవం జరగ్గా.. కోలాటం, కాళీకా వేషాధారణలతో తిరువీధులు నిర్వహించారు. సర్పంచ్ తడక జోగారావు, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద పాల్గొన్నారు. అలాగే బెంకిలిలో కూడా గ్రామదేవత బైరోడమ్మ చల్లదన ఉత్సవం నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బూర్జపాడు, వేదపురం, కొఠారి, మండపల్లి తదితర గ్రామాల్లో గ్రామదేవతలకు చల్లదనం ఉత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామదేవతను ఊరేగించారు.